# ఎటికెట్

"నీకు తెలిసిన ఎటికెట్ అంతా ఒక పోస్టేజి స్టేంపు మీద రాసెయ్యొచ్చు" అన్నారు మావారు కమలా, ఆమె మొగుడూ, వాళ్ల కుక్కా కారెక్కగానే.

నిజం చెప్పొద్దూ! ఆ మధ్య ఎటికెట్ మీద వ్యాసాలు రాసి డబ్బు సంపాదిద్దావా, అన్న ఆలోచనొచ్చింది. వెంటనే ఎటికెట్ మీద రాసిన ఇంగ్లీషు పుస్తకాలన్నీ కొని మరీ చదివేను. అవి చదివేక నాకు అర్థం అయింది ఒకటే - మనకు ఎటికెట్ అవసరం లేదని. ఇప్పుడింక మావారు నాకు సర్టిఫికెట్ కూడా ఇచ్చేశారు.

మావారి జెడ్జిమెంటు విన్నాక డబ్బు సంపాదించే మార్గం మరోటేదైనా వెతుక్కోవాలి. నోట్లు అచ్చు కొట్టడం మినహా ఏదైనా జెయ్యడానికి సిద్ధవేఁ. పట్టుబడతానన్న భయం లేకపోతే అచ్చు కొట్టడానికీ సిద్ధవేఁ.

"గాడిదేం చేస్తుందే సుందరమ్మడూ" పక్కనే ఉన్న మా వారు బాంబు పేల్చేరు.

"బరువులు మోయును" అనొచ్చు.

"ఓండ్ర పెట్టును" అని కూడా అనొచ్చు.

కాని నేనేవీఁ అన్లేదు. అర్థంలేని నవ్వు నవ్వేను.

"మెయిన్ రోడ్డు మీద గాడిద పరిగెత్తడం నువ్వెప్పుడైనా చూశావా? చూసి ఉండవులే. నీకు మనుషులే కనిపించరు. ఇంక కుక్కలు, గాడిదలు ఏం కనిపిస్తాయి. గాడిదెలా పరుగెడుతుందో తెలుసా! ఎంతమంది ట్రాఫిక్ కానిస్టేబుల్సు చేతులెత్తినా అగుతుందా? దమ్ము అయిపోతే అగుతుంది. నువ్వూ అంతే. ఆవిడతో అలా గంటల తరబడి మొగుళ్ల మీద చింకి లెక్చర్లు దంచకపోతే వాళ్ల కుక్కకి మరో బిస్కట్ కావాలేమో అడుగుతే తప్పా?"

ఏంవిటో!

ఎన్నేళ్లొచ్చినా ఈ ఎటికెట్ సంగతి మాత్రం నాకు అర్థం అవడంలేదు.

నాకు అర్థం అయింది ఒకటే – నేనేం చేస్తే అది ఎటికెట్ కాదని.

మాట వరసకి ఓ సారి మా వారితో కలిసి సినిమాకి వెళ్ళేను. సినిమాలో ఓ జోక్‌కి మావారితో సహా హాలు హాలంతా విరగబడి నవ్వేరు. నేనూ నవ్వేను. ఇందులో విశేషవేం వుంది? ఏం లేదు. విశేషమంతా తరవాతే ఉంది.

సాధారణంగా మావారు ఇంటర్వెల్లో సిగరెట్టు కోసం బైటికి వెళ్తారు. ఆవేళ వెళ్లలేదు. పైగా కొంచెం సర్దుకొని కూర్చున్నారు. ఇన్నేళ్ల కాపరంలో నేను గ్రహించిన విషయం మావారు సిగరెట్టు కూడా మానేసి కూర్చున్నారంటే నాకు క్లాసు తీసుకోబోతున్నారని. క్లాసు ప్రారంభమైంది.

"పశువు ఏం చేస్తుందో తెలుసా? సంతోషం వస్తే గబ గబ పరిగెత్తేసి తోవలో ఏదుంటే దాన్ని కుమ్మేస్తుంది. కోపం వచ్చినా అంతే. రంకె వేసి కనిపించిన వాళ్లందర్నీ కుమ్మేస్తుంది. ఎందుకో తెలుసా? భగవంతుడు దానికి కంట్రోలు ఇవ్వలేదు. మనిషికీ పశువుకీ అదే తేడా. పరువున్న ఆడది పది మందిలో పగలబడి నవ్వడం ఎటికెట్ కాదు"

అంతే!

అప్పటి నుండి లారెల్ హార్డీ సినిమా చూసినా సరే డ్రిల్ సార్జంట్‌లా నవ్వటం నేర్చుకున్నాను. అసలీ బాధపడలేక సినిమాలు చూడ్డం మానేద్దామనుకున్నాను. ఏంవిటో నా వెర్రి. మానడం చూడ్డం నా చేతిలో ఉందా?

లేదని వెంటనే రుజువైపోయింది.

ఆ వేళ కోర్టు నుండి వస్తూనే మావారు "సినిమాకి వెళ్దావేంవిటే చిలకా?" అన్నారు.

"ఒద్దు" అంటే మొగుడితో ఎలా మాట్లాడాలో తెలీదంటారేమో.

"అలాగే" అంటే సినిమా హాల్లో మూడుగంటలు మెడిటేషన్లో కూర్చోవడం ఇష్టం ఉండదు.

"ఇప్పుడు టిక్కెట్లు అందుతాయా" అందామన్న ఆశ.

"నేనంత వెర్రి వెధవని కాను. ప్లానింగ్ లేకుండా ఏ పనీ చెయ్యను. టిక్కెట్లు ఎప్పుడో రిజర్వు చేయించేను."

ఆ ఆశ కూడా పోయింది.

ఎవరైనా ఫ్రెండ్సు వస్తే బావుండును.

ఏ ఫ్రెండూ రాలేదు.

"ఆహా! ఏముహూర్తాన పుట్టేవో కాని సుందరమ్మ తల్లీ. నీకు నా జోహార్లు. ప్రపంచంలో మొగుడుగాడు సినిమాకి తీసికెళ్ళకపోతే ఇల్లు నరకం చేసిన ఆడవాళ్లని చూశేను. కాని మొగుడు వెధవ సరదాగా సినిమాకి రమ్మంటే తద్దినం మొహం పెట్టిన ఆడదాన్ని నిన్నే చూస్తున్నాను. ఓ సరదా లేదు. సరసం లేదు," సణుగుతూనే ఉన్నారు.

సరదా ఎందుకు లేదు. బేషుగ్గా ఉంది. ఆ మధ్య అదేదో సినిమాకి పత్రికలవాళ్లు, ప్రజలూ "ఆఫ్ బీట్ సినీమా" అనీ అది చూడకపోతే జన్మ వ్యర్థం అనీ తెగ గోలచేసేరు. వెధవ టెంప్టేషన్ చంపుకోలేక ఆ సినిమాకి వెళ్దాం అన్నాను.

వెళ్లేం.

ఆ సినిమా ఆఫ్ బీట్ కాదు.

ఫుల్ బీటు.

ఎడా పెడా వాయించేశేడు.

ఆ తరువాత వారం రోజుల వరకు మావారు ఇంటికెవరొచ్చినా "ఫలానా సినీమా చూశేరా? తప్పకుండా చూడండి. లేకపోతే మా ఆవిడ నొచ్చుకుంటుంది" అని చెప్పేవారు.

మొత్తానికి నాకు సినీమాల మీద కోరిక చచ్చిపోయింది. పైగా అదొక శిక్షగా మారింది.

ఇవేళ శిక్ష తప్పేట్లు లేదు.

అయితే ఆ వేళ నా అదృష్టం బావుండి సినీమా హాల్లో మరో ఫ్రెండు తగిలేడు. అతను మాత్రం వృద్ధ బుద్ధుడిలా బుద్ధిగా సినీమా చూస్తున్నాడు. (అతనిక్కూడా వాళ్లావిడ ఎటికెట్ పాఠాలు చెప్పిందేమో.) ఆవిడ మాత్రం ప్రతి పది నిమిషాలకీ కారణం ఉన్నా లేకపోయినా

పగలబడి నవ్వేస్తోంది. పైగా ఆ సినీమా ట్రాజెడీ. అందులో నవ్వడానికేం ఉందో నాకర్థం కాలేదు.

ఆవిడ నవ్వు కుదుపుకి ఆ వరస కుర్చీల్లో ఎవరైనా నిండు చూలాలు గనక ఉంటే నొప్పుల బాధ లేకుండా కనేస్తుంది.

ఆ కుదుపుకి కుర్చీలన్నీ ఉయ్యాలలా ఊగుతున్నాయి.

ఇంటెర్వెల్లో మావారు ఆవిడతో "You have a charming smile I say" అంటున్నప్పుడు మాత్రం నాకు మొగుడన్న మొహమాటం లేకుండా చాచి లెంపకాయ కొట్టాలనిపించింది. ఆడదానికి ఆవేశం ఉండకూడదట - ఇదీ మావారి ఉవాచే - అంచేత ఊరుకున్నాను.

నా శాపవిమోచనం అయిపోయింది.

సినీమా అయిపోయింది.

తోవలో "చూడు వెంకటేశ్వర్లూ రోడ్డు మీద పిట్ట కూడా లేదు. ఎందుకిలా హారన్ కొట్టేస్తావు? హారను కొడితే చెట్లు తప్పుకోవు. మనవే తప్పుకోవాలి. అనవసరంగా హారన్ వాడితే బేటరీ డౌనయిపోతుంది ... ఫస్ట్ గేర్‌లో పోనీ. .. రోడ్డు మీద అన్ని లైట్లున్నాయి కదా లైట్లు డిమ్ చెయ్యి..." అని డ్రైవర్‌ని ఊదర కొట్టేస్తున్నారు.

ఏమాట కామాటే చెప్పుకోవాలి. మావారికి తన, పర భేదం లేదు. ఇంట్లో నన్నెలా తింటారో కార్లో ఆ డ్రైవర్‌నీ అలానే తింటారు. పాపం పూర్ ఫెలో నాకు వాణ్ణి చూస్తే జాలేస్తుంది. స్వతహాగా బాగానే నడుపుతాడు. మావార్ని చూస్తే మాత్రం ఒణుకు.

వెళ్తున్నది కార్లో అయినా నాకు మాత్రం ముళ్ల మీద కూర్చున్నట్లుంది. నేనే ఫీలింగూ దాచుకోలేను. అంచేత నా మొహం ముళ్ల కంచెలా ఉంది. లేకపోతే పెళ్లానికో సిద్ధాంతం, పైవాళ్లకి మరో సిద్ధాంతవూనా ఈ మొగాళ్లని ఏం చేసినా పాపం లేదు. రాదు. ఇంటికెళ్లేక రేగు కాయలు దులిపినట్లు దులిపేయాలి. కాకపోతే మరో గంట క్లాసు. అంతే కదా నా కడుపులో మంటైనా తగ్గుతుంది.

మావారికి థాట్ రీడింగ్ కూడా ఉన్నట్లుంది.

"నీ కడుపు మంట నాకు తెలుసు కానీ అనవసరంగా అలా కుళ్లిపోకు. బీ.పీ. పెరిగితే చెయ్యలేక నేను చావాలి. ఆవిడ వెర్రి నవ్వుని

మెచ్చుకున్నాననే కదా నీ బాధంతా. పరాయి ఆడది ఏం చేసినా మెచ్చుకోవడం ఎటికెట్ తాలూకు ప్రథమ లక్షణం. నిన్ను ఎడ్యుకేట్ చెయ్యడం నావల్ల కాదు." అన్నాడు నా నెత్తి మీద చిన్నగా మొట్టి.

పోనీ దాసోహం అయిపోయి "నాథా! ఈ ఎటికెట్ నాకర్థం కాదు కొంచెం నేర్పండి?" అందామంటే "మొగుడు నడుపుతున్న కార్లోంచి – అప్పటికి మావారు డ్రైవింగ్ తీసుకున్నారు – గెంతడమే ఎటికెట్." అటారేమో!

ఇంతకీ మనస్ఫూర్తిగా నవ్వుకోలేని ఈ ఎటికెట్ మనకి అంత అవసరమాఁ?!

ఏమోమరి!

★ ★ ★